మెట్ట వరి సాగు భూసారానికి మేలు

లింగాలఘణపురం : మెట్ట వరి సాగు పద్ధతులు పాటిస్తే రైతులకే కాకుండా భూసారానికి కూడా మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని జీడికల్ గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం, ఆదర్శ ఏనె బావి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పరిశోధన సంస్థ సహకారంతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెట్ట వరి సాగుపై రైతులకు వివరించారు. సాంప్రదాయ పద్ధతుల్లో ఎక్కువ నీటి వినియోగంతో భూమి చౌడుగా మారుతుందని, మిథేన్ వాయువులు ఎక్కువగా విడుదలై వాతావరణం వేడెక్కుతుందని, భూగర్భ జలాల వినియోగం ఎక్కువౌతుందని, రైతులపై కూలి భారం పెరుగుతుందని తెలిపారు. సదరు సమస్యలన్నిటినీ మెట్ట వరి సాగుతో అధిగమించవచ్చని చెప్పారు. వ్యవసాయంలో వస్తున్న నూతన ఒరవడులను రైతులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, ఇతర అంశాల విషయంలో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. రైతులకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ వర్షాసింగ్, డాక్టర్ అనిర్బన్‌నాథ్, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు అనిల్, మధు, శేఖర్, సీఎస్‌ఏ నుంచి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

లింగాలఘణపురం : నేడు (శనివారం) మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చిట్ల జయశ్రీ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల వసూళ్లపై సదస్సు

జనగామ : జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులు వసూళ్లు, విద్యాహక్కు చట్టం ఉల్లంఘనపై నేడు (శనివారం) సీపీఎం జిల్లా కార్యాలయంలోని ప్రజాసంఘాల హాలులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు, బెల్ట్‌ల అమ్మకాలతోపాటు ఐఐటీ టెక్నో, తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పలు అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కనకం అఖిల్ శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని సాయంత్రం పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.5 వేలు సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట పోలేపల్లి రంజిత్‌రెడ్డి, సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ బబ్బుల వంశీ, ఎంపీటీసీ సుధాకర్, నాయకులు పెనుకుల యాదగిరి, వరప్రసాద్, బోగం సతీశ్, వెన్నం మాధవరెడ్డి, మంతెన రాజు, కుసుమ రవి, మేడ్చల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



జనగామ రూరల్ : ఎమ్మెల్సీ కవిత పెళ్లి రోజును పురస్కరించుకుని ఎర్రబెల్లి సేనా ఆధ్వర్యంలో పట్టణంలోని రాజరాజేశ్వరీ అనాథాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి యువసేన ప్రతినిధులు సుధాకర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆవు మృతి



బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట గ్రామంలో రైతు బండ సంపత్‌కు చెందిన ఆవు మృతి శుక్రవారం చెందింది. రైతు ఆవుకు మేత వేసి వ్యవసాయ పనులు కాసేపటికి అది కింద పడి గిలగిలా కొట్టుకుని మృతి చెందింది. తాను రూ.90 వేల విలువైన ఆవును కోల్పోయానని బాధితుడు విలపించారు.

లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు



బచ్చన్నపేట : కోదాడ నుంచి సిమెంట్ లోడుతో మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న లారీ మండలంలోని ఆలింపూర్, వీఎస్ఆర్ నగర్ గ్రామాల మధ్య పెసరు బండల వద్ద లారీ బోల్తా పడి డ్రైవర్ రాజారాంకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మండల కేంద్రం నుంచి చేర్యాల వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులు నడుస్తుండగా కాంట్రాక్టరు రోడ్డు పక్కన పెద్ద గుంతలను తీశారు. కాగా హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డు పక్కన గుంత ఉన్నట్లు డ్రైవర్‌కు తెలియని పరిస్థితి ఉండడంతో లారీ అదుపుతప్పి పడిపోయింది. వెంటనే సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తు చేసుకోవాలి

రఘునాథపల్లి : కొత్తగా భూములు పట్టా చేసుకున్న రైతులు ఈనెల 26లోగా రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కాకి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16 నాటికి పట్టా చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకుంటే వారి ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు. అర్హులు పట్టాదారు పుస్తకంతోపాటు బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ప్రాధాన్యం

చిల్పూరు : బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తోందని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన 600 మీటర్ల డ్రెయినేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమ సమ్మయ్యకు అందజేసి మాట్లాడారు. గ్రామంలోని కొన్ని వార్డుల్లో డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎంపీటీసీ ఉమ సమ్మయ్య తన దృష్టికి తీసుకురాగా స్పందించి జెడ్పీ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, గజ్జెల దామోదర్, సంపత్, సహస్ర, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తర్వులను ఎంపీటీసీకి అందజేస్తున్న సంపత్‌రెడ్డి

'ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుంటలా మారిన అంగడి'

చిల్పూరు : ప్రభుత్వ నిర్లక్ష్యంతో మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట అంగడి స్థలం కుంటను తలపించేలా తయారైందని బీజేపీ మండల నాయకుడు గొల్లపల్లి వాసు ఆరోపించారు. శుక్రవారం కురిసిన చిరువర్షానికే కుంటలా మారడంతో ఆయన స్థానిక మహిళలతో కలిసి అంగడి స్థలాన్ని సందర్శించి మాట్లాడారు. బీటీ రోడ్డు వేయకముందే కాల్వలు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆ దిశగా చేసిందేమీ లేకపోవడంతోనే అంగడి స్థలం చిన్నపాటి వర్షానికే కుంటలా తయారైందని చెప్పారు. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు పూర్తి కావడంతో వర్షపు నీరు వెళ్లే దారి లేక డ్రెయినేజీలో నీరు నిలుస్తుందని తెలిపారు. ఇక భారీ వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు మాచర్ల కోమల, తౌటి భాను, బాల్నె ప్రవళిక, స్వరూప పాల్గొన్నారు.


అంగడి స్థలంలో నిలిచిన నీరు

జీపీకి వైకుంఠ స్వర్గరథం బహూకరణ

రఘునాథపల్లి : మండలంలోని వెల్ది గ్రామ పంచాయతీకి రఘునాథపల్లి గ్రామానికి చెందిన వీరమల్ల రాజేశ్వర్‌రావు అతడి తల్లిదండ్రులు లక్ష్మి–శంకరయ్య స్మారకంగా వైకుంఠ స్వర్గరథాన్ని బహూకరించారు. ఈ మేరకు పత్రాలను సర్పంచ్ కొయ్యడ మల్లేశ్‌కు దాత రాజేశ్వర్‌రావు గ్రామస్తుల సమక్షంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేశ్ మాట్లాడారు. జీవితంలో అంతిమ యాత్రను చివరి మజిలీగా అభివర్ణించారు. మృతుల అంతిమయాత్ర సాఫీగా సాగేలా రూ.3 లక్షల విలువైన వైకుంఠరథాన్ని అందజేసినందుకు రాజేశ్వర్‌రావును అభినందించారు. స్వర్గరథం వాహనంలో మృతదేహాన్ని తీసుకెళ్లే సదుపాయంతోపాటు భగవద్గీత శ్లోకాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం రాజేశ్వర్‌రావును శాలువాతో సర్పంచ్ సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుమల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నోముల సాయిబాబా, వార్డు సభ్యులు పెద్దగోని రాజు, కావటి నాగరాజు, గువ్వ యాదలక్ష్మి, దర్శనాల రవి, పెండ్లి లావణ్యారెడ్డి, కొయ్యడ భిక్షపతి, రంగు శ్రీనివాస్‌గౌడ్, బత్తిని మల్లేశ్, పెండ్లి సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆరేళ్ల సత్తయ్య, తాడూరి సత్తయ్య, బుచ్చయ్య, మహిపాల్, యాదవరెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్వర్గరథం పత్రాలను సర్పంచ్‌కు అందజేస్తున్న రాజేశ్వర్‌రావు

రామకృష్ణయ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట గ్రామంలో హత్యకు గురైన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జితేందర్ ప్రభుత్వాన్ని కోరారు. రామకృష్ణయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం జితేందర్ మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యలో అధికార పార్టీ నాయకులు, పోలీసుల పాత్ర కీలకంగా ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించారని తెలిపారు. సూత్రదారులను గుర్తించి అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. తొలుత రామకృష్ణయ్య చిత్రపటానికి జితేందర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జితేందర్, తదితరులు

బాధిత కుటుంబానికి బియ్యం సాయం

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన కోతి అంజమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆత్మీయ సేవా సంస్థ ప్రతినిధులు శుక్రవారం 50 కిలోల బియ్యం సాయంగా అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడారు. పేద కుటుంబాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు సంస్థ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బిర్రు సోమేశ్వర్, అనుముల మహేందర్, ముసుకు కేశవరావు, ఏదునూరి మదార్, తొడుసు మల్లేశం, జక్కుల రాజు, బిర్రు వెంకటేశ్వర్లు, అనంతుల పురుషోత్తం, యారరాజు, తదితరులు పాల్గొన్నారు.


బియ్యం అందజేస్తున్న సంస్థ సభ్యులు

సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలి

తొర్రూరు రూరల్: సేవా కార్యక్రమాలకు స్థానికులు చేయూత అందించాలని వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండ యాకన్నగౌడ్ తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో గ్రామ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కేవులతండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం సన్న బియ్యం, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, చికెన్‌తో కూడిన మధ్యాహ్న భోజనం అందించారు. అలాగే స్థానికులకు గొడుగులు, వాటర్ క్యాన్లు, దుస్తులు, బకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. తదనంతరం గ్రామానికి చెందిన పుప్పాల సోమయ్య 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు ఉపేందర్ ఆర్థిక సహకారంతో వస్తువుల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యాకన్నగౌడ్ మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'ఆపద్బాంధవుడు కేసీఆర్'



నర్మెట : సీఎం కేసీఆర్‌ను ఆపద్బాంధవుడుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అభివర్ణించారు. మండల కేంద్రానికి చెందిన ధన్నారపు రాజేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని రాజేశ్‌కు కిరణ్‌కుమార్ శుక్రవారం అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ బడుగుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేశ్ నిమ్స్‌లో వైద్యం పొందుతున్నట్లు తెలియడంతో సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్ఓసీ మంజూరు చేయించినట్టు తెలిపారు. కిరణ్‌కుమార్‌కు రాజేశ్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ కుమార్, హేమంత్, బాబు తదితరులున్నారు.

పాతవి మాఫీ చేసి కొత్త రుణాలివ్వాలి

జఫర్‌గఢ్ : తక్షణమే రైతులకు పాతవి మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష రూపాయల వరకు మాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ హామీ ఇచ్చిందని, నాలుగేళ్లు గడిచినా నిలబెట్టుకోవడం లేదని తెలిపారు. రుణమాఫీకి నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఐకేపీ ద్వారా యాసంగి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఖరీఫ్‌లో పెట్టుబడి కోసం నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఒకేసారి లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయాలని, ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పిన్నింటి సమ్మయ్య, నక్క యాకయ్య, పిన్నింటి సమ్మయ్య, వేల్పుల చిన్నరాములు, నీరటి కొంరయ్య, వేల్పుల పెద్ద రాములు, బుల్లె దూడయ్య, కృష్ణ, శాగ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హనుమానాయక్ మృతి


హనుమా (ఫైల్)

దేవరుప్పుల : మండలంలోని ధారావత్‌తండా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కునుసోతు హనుమనాయక్ (60) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. పేదల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం ప్రభుత్వం స్థలం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ నిఖిల సమక్షంలో మంత్రి దయాకర్ రావు చేతుల మీదుగా చింతబాయితండాలో 20 ఇళ్లకు ఉచితంగా స్థలం ఇచ్చిన దాతృత్వం ఆయన సొంతం. రాజకీయ, సామాజిక సేవలు అందించిన ఆయన మృతి పట్ల ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, జెడ్పీటీసీ పల్లా భార్గవి సుందర్‌రామిరెడ్డి, వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ గేమా నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూతాటి నర్సింహ్ములు, జోగు సోమ నర్సయ్య తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

తొర్రూరు: గ్రామ పంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సమ్మె నోటీసును కార్యాలయ ఉద్యోగికి అందించగా రవి మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది జూలై 6 నుంచి నిరవధిక సమ్మె చేస్తారని, జీఓ నంబర్ 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు యాకయ్య, సందీప్, ప్రశాంత్, వెంకన్న, వీరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

పెద్దవంగర: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు ఉంటాయని ఎస్సై పిల్లల రాజు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టులను చేపట్టితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని చెప్పారు. గ్రూప్ మెంబర్స్ తప్పుడు సందేశాలను చేరవేసినా అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేంద్ర నిధులతోనే పల్లెల అభివృద్ధి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప

నర్మెట/తరిగొప్పుల : 'కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో కేంద్రం వాటా ఉంది' అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. 'మహాజన్ సంపర్క్ యోజన్'లో భాగంగా నర్మెట మండలంలోని గండిరామారం, తరిగొప్పులల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి లైట్లు, ఉపాధిహామీ పనులు, హరిత హారం, నర్సరీలు, శ్మశాన వాటికలు, పౌష్టికాహార కేంద్రాలు, రైతువేదికలు, డంపింగ్ యార్డుల నిర్మాణం ఇలా జీపీలకు 90 శాతం నిధులు కేంద్రం అందిస్తున్నదని చెప్పారు. రైతులకు అందిస్తున్న ఎరువులపై రూ.18వేల కోట్ల సబ్సిడీ భరించడమే కాకుండా అన్నదాతల ఖాతాల్లో రూ.6వేలు రైతు బంధు జమ చేస్తోందన్నారు. మహిళల కోసం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం బీరప్ప ట్రస్టు ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు ధరావత్ రాజు, బల్ల శ్రీనివాస్, నవీన్, అఫ్జల్, చెవుల రాజు, చలం శంకర్, సుధాకర్, లక్ష్మయ్య, ఆవుల శ్రీనివాస్, అనిల్, దరావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన పథకాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పెనుగొండ సోమేశ్వర్, కడుదుల నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.


గండిరామారంలో ఇంటింటికి కరపత్రాలు, స్టిక్కర్లు అందజేస్తున్న బీరప్ప

సమస్యలను విస్మరించి 'ప్రగతి నివేదన'

- ఏఐపీసీ నాయకుడు డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ

స్టేషన్ ఘన్‌పూర్ : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను విస్మరించి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పనికి మాలిన పల్లె ప్రగతి నివేదన యాత్ర చేశారని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ (ఏఐపీసీ) నాయకులు డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ విమర్శించారు. స్థానిక ఎస్ఎస్‌కే ఆస్పత్రిలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎంలుగా కడియం శ్రీహరి, డాక్టర్ రాజయ్య ప్రాతినిధ్యం వహించినా నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని ఆందోళన వెలిబుచ్చారు. గడచిన తొమ్మిదేళ్లలో ఏం సాధించారని బీఆర్ఎస్ నాయకులు దశాబ్ది ఉత్సవాలు చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాజయ్య పల్లె నిద్రలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో సమస్యలపై ఎమ్మెల్యేను ప్రజలు నిలదీసినా స్పందన లేదని ఎద్దేవా చేశారు. చిల్పూరు మండలంలోని కేజీబీవీ సమస్యను పలుమార్లు ప్రస్తావించినా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించడం లేదన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో స్థానిక యూపీహెచ్‌సీలో స్పెషలిస్టు వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించి విద్య, వైద్య, విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బేతి జయపాల్‌రెడ్డి, ధర్మసాగర్ మండల మాజీ అధ్యక్షుడు తూటి నర్సింహారెడ్డి, నాయకులు పట్టపురి సదయ్యగౌడ్, తాళ్లపెల్లి విజయ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గుర్రం సోమయ్య, ఉపేందర్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ

సర్పంచ్ దంపతులకు విద్యార్థుల అభినందన

చిల్పూరు : మండలంలోని రాజవరం గ్రామ సర్పంచ్ మారేపల్లి తిరుమల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శుక్రవారం అభినందనలు తెలిపారు. 'మన ఊరు–మన బడి'లో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోపాటు సొంత నిధులు కేటాయించి తాము కోరిన విధంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదనపు సౌకర్యాలు కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారేపల్లి లలితదేవి, శ్యాంకుమార్‌రెడ్డి, యాకూబ్, రంగు రవి, అసాద్, ఈర్ల సమ్మయ్య, కన్నెబోయిన రమేష్, మచ్చ రమేశ్ పాల్గొన్నారు.


సర్పంచ్ దంపతులతో విద్యార్థులు

'పాఠశాలలో విద్యార్థులతో పనులు'

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోతు తరుణ్ తెలిపారు. శివునిపల్లిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాఠశాలను సందర్శించామని చెప్పారు. విద్యార్థులతో గోడలకు పట్టిన బూజును దులిపిస్తున్నారని తెలిపారు. ఒకవైపు సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ అంటూ ఊదరగొడుతున్నా విద్యార్థులతో స్కావెంజర్లు చేసే పనులు చేయిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఈ విషయమై ప్రశ్నించగా విద్యార్థి సంఘం నాయకుల పట్ల ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

రామకృష్ణయ్య హత్య కేసును సీబీఐకి అప్పగించాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగిటి నరేష్

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసును సీబీఐకి అప్పగించి బాధ్యులను, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగిటి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మిన్నాలపురం జలేందర్‌తో కలిసి మాట్లాడారు. రామకృష్ణయ్యను హత్య చేయడానికి మే 21న నారాయణపురంలో సర్పంచ్ మాసపేట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యూహం రచించారని, ఇందుకు అవసరమైన సుపారీ డబ్బులను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సొసైటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న రామకృష్ణయ్యను అతి దారుణంగా హత్య చేయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. హత్య వెనుక ఉన్న వ్యక్తులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బక్క రవి, విజయభాస్కర్, గణేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

పెద్దవంగర: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి తెలిపారు. మండల కేంద్రంతోపాటు అవుతాపురం గ్రామంలోని రైతు వేదికలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన 100 మంది మహిళలకు శుక్రవారం కుట్టు మిషన్లు, ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సర్పంచ్‌లు వెనకదాసుల లక్ష్మీ, సల్దెండి మంజుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన, ఎంపీఓ నరేంద్రకుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.